క్లుప్తంగా

అన్నసమారాధన



కొంకుదురులో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు కాలువ సమీపంలో ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు. కొంకుదురుతో పాటు పందలపాక, సావారం, తొస్సిపూడి, ఊలపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మాజీ ఉప సర్పంచ్ రాంబాబు మృతి



రాంబాబు (ఫైల్)

మధురపూడి: కోరుకొండ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ బావన రాంబాబు (78) బుధవారం మృతి చెందారు. ఆయన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ కమిటీ నాయకుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. రాంబాబు మృతికి సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు కేతినేటి అశోక్, పసుపులేటి బుల్లియ్యనాయుడు, వాకా నరసింహమూర్తి, కోడినాగుల వెంకటేశ్వరరావు, తదితరులు సంతాపం తెలిపారు.

ఘనంగా సూర్యప్రకాశరావు జయంతి



సూర్యప్రకాశరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మధురపూడి: రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, పీసీసీ సభ్యుడు దివంగత నేత ఉల్లి సూర్యప్రకాశరావు జయంతిని బుధవారం కోరుకొండలో నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ సమీపంలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ బాబ్జి, ఉల్లి చెల్లారావు, ఉల్లి కాశీ, ఆయన అభిమానులు బదిరెడ్డి దొర, ముషిణీ శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై నేడు అవగాహన

రంగంపేట: రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ మండల ఏఈ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించే ఈ సమావేశానికి సంస్థ అనపర్తి ఏడీఈ పి.సన్యాసిరావు హాజరవుతారని చెప్పారు. రైతులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ప్రకాశం నగర్: నన్నయ యూనివర్సిటీ పరిధిలో గల డిగ్రీ కళాశాలల మధ్య గురువారం నుంచి స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో కబడ్డీ పోటీలు, యూనివర్సిటీ స్థాయి జట్ల ఎంపికలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు ఈనెల 9 నుంచి 12 వరకూ జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయం కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయన్నారు. సుమారు 45 జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయని చెప్పారు.

అవార్డు లభించడం ఆనందదాయకం



అవార్డు అందుకుంటున్న పుత్ర హనోక్

సీటీఆర్ఐ: డొక్కా సీతమ్మ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని నగరానికి చెందిన జేఎస్ఎస్ డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్ అన్నారు. ఆయన మంగళవారం అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ వైజ్ మెన్ ఇంటర్నేషనల్ డొక్కా సీతమ్మ అవార్డ్‌ను అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసన మండలి సభ్యుడు బొమ్మి ఇశ్రాయేలు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం తన స్వగృహంలో హనోక్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు.

పేదల అభ్యున్నతికి విశేష కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి
- అట్టహాసంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామం శివారు పాటిమీదలో బుధవారం సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన మెటల్ రోడ్డును ప్రారంభించి, రూ.10 లక్షలతో నిర్మించే సామాజిక భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డుకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతుల నామకరణం చేశారు. కార్యక్రమానికి కేపీఆర్ ఫెర్టిలైజర్స్ ఎండీ కె.ముకుందరెడ్డి, కాకినాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కర్రి చినబాబు, రాష్ట్ర స్పీకర్ టి.సీతారాం, ఓఎస్‌డీ సత్యనారాయణరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నేత చింతా దొరబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు, ముఖ్యఅతిథులకు ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ బాణసంచా కాల్చారు. కేరళ డప్పులతో నృత్య ప్రదర్శన, తీన్‌మార్ డప్పులు, భారీ పూలవానతో స్వాగతం పలికారు. నూతనం నిర్మించిన రోడ్డులో ఒక కి.మీ. మేర ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యేకు హారతులిచ్చి, శాలువాలు, పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు.



జి.మామిడాడలో రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఇతర నాయకులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో 1,300 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. రూ.2.50 కోట్లతో గ్రామంలో నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేశారని వివరించారు. జలజీవన్ మిషన్ పథకంలో సుమారు రూ.2.60 కోట్ల నిధులతో పైపులైన్ల ఆధునికీకరణ, వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్లు, తాగునీరు. డ్రైనేజీలు, పాఠశాలల అభివృద్ధి, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక సౌకర్యాలు వేగంగా చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీలు కర్రి వెంకటపద్మావతి, సత్తి లక్ష్మి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పైన గ్రామ సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3న సీతానగరంలో జగనన్నకు చెబుదాం

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం సీతానగరం మండలంలో నిర్వహించనున్నామని కలెక్టర్ కె.మాధవీలత బుధవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. సీతానగరంలోని జేవీకే ఫంక్షన్ హాలులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: కెనాల్ రోడ్డులో బిక్కవోలు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జి.మామిడాడకు చెందిన కొల్లి లోవరాజు బుధవారం రాత్రి బైక్‌పై భార్యాపిల్లలతో కలిసి అనపర్తిలోని అత్తగారింటికి బయలుదేరాడు. సామర్లకోట నుంచి రావులపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన లోవరాజును సమీప ఆస్పత్రికి తరలించారు.

ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే రావాలి



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదరికమే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న మనసున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో ఆయన ప్రజలకు వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే తమ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారన్నారు. తమ కుటుంబాలకు ధైర్యం, తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా, రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి సీఎం జగన్ అని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రోజురోజుకూ జగన్‌కు ప్రజల్లో మంచి ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, పార్టీ నాయకులు కర్రి రామసుబ్బారెడ్డి, విప్పర్తి సునీత, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు జి.మురళీకృష్ణారెడ్డి, కర్రి బుజ్జి, పప్పు చిన్నారెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెర్నింగ్ లాస్ తగ్గించేందుకే ఎఫ్ఎల్ఎన్

రాజానగరం: విద్యార్థుల్లో లెర్నింగ్ లాస్‌ను తగ్గించేందుకే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రోగ్రామ్ (ఎఫ్ఎల్ఎన్)ను ప్రాథమిక, పూర్వ ప్రాథమిక స్థాయిలో అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. కొండగుంటూరులోని సత్యశ్రీ పరిమళ విద్యాసంస్థలో తూర్పు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన డీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో అబ్రహం మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్య నుంచే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ, విద్యాశాఖలు సంయుక్తంగా ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే అభ్యసనా సామర్థ్యాలను పెంపుదల చేసేందుకు ఎఫ్ఎల్ఎన్ ఉపకరిస్తుందన్నారు. పూర్తిగా యాక్టివిటీ బేస్డ్ విధానంలో విద్యాబోధన సాగుతుందన్నారు. డీఆర్పీలు శిక్షణను సద్వినియోగం చేసుకుని, తిరిగి మండల స్థాయిలో సమర్థంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ట్రైనింగ్ ప్రోగ్రామ్ రాష్ట్ర పరిశీలకులు అరవ ప్రభాకర్ మాట్లాడుతూ మూడేళ్ల పాటు జ్ఞానజ్యోతి కార్యక్రమం అమలవుతుందన్నారు. అభ్యసనా సామర్థ్యాలను చిన్నారుల్లో మెరుగుపర్చేందుకు ఎఫ్ఎల్ఎన్ అద్భుతమైన కార్యక్రమమన్నారు. ఏఎంవో డి.గౌరీశంకర్ మాట్లాడుతూ ఆరు రోజుల పాటు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని డీఆర్పీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కీ రీసోర్స్ పర్సన్లు ఎం.సాంబశివరావు, టి.కనకవల్లి, సీహెచ్.గోవిందరాజు, ఎ.కృష్ణకుమారి, ఎం.రాజేంద్రబాబు, జె.రాజేంద్రబాబు, జె.కళావతి, వీవీవీ వరాహలక్ష్మి, యు.ఎస్.స్వర్ణకుమారి శిక్షణ ఇస్తున్నారు.



ఎఫ్ఎల్ఎన్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి సూచనలిస్తున్న డీఈవో అబ్రహం

ప్రగతి పథంలో స్వయం సహాయక సంఘాలు

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, రాఘవపురాల్లో సమావేశాలు

మధురపూడి: స్వయం సహాయక సంఘాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. బుధవారం కోరకొండ మండలం కోటికేశవరం, రాఘవపురం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లోని సచివాలయాల్లో డ్వాక్రా గ్రీవెన్స్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను మహరాణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలిపారు. అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందజేయాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మురుగునీటి కాలువల నిర్మాణం, తాగునీటి సమస్యలను తెలయజేశారు. దీనికి స్పందించిన విజయలక్ష్మి త్వరగా పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలతో పేదల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. తొలుత రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కోటికేశవరం ఎంపీటీసీ నేత బుజ్జి, సర్పంచ్ ముడే సింధూదివ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ముడే కామేష్ పాల్గొన్నారు.



కోటికేశవరంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

ప్రజారోగ్యం కోసమే జగనన్న సురక్ష

రాజానగరం: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. తూర్పుగానుగూడెంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ పర్యవేక్షణలో శిబిరానికి వచ్చిన 600 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పి.మార్తమ్మ, జి.కుమారి పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ రకాల ఆహార పదార్థాలతో కూడిన స్టాళ్లను ఏర్పాటుచేశారు.

నర్సాపురంలో 632 మందికి వైద్యసేవలు

మధురపూడి: కోరుకొండ మండలం నర్సాపురంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచ్ కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు చొంగా శివయ్య ప్రారంభించారు. తహసీల్దార్ పాపారావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద, బడుగులకు ఉపయోగకరంగా ఉందన్నారు. శిబిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 632 మందికి వైద్యపరీక్షలు చేశారు. అలాగే 42 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద హాస్పటళ్లకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో పర్పంచ్ కడియాల పాపారావు, కోరుకొండ పీఏసీఎస్ చైర్‌పర్సన్ మారిశెట్టి నాయుడు, ఈఓఆర్డీ మహేశ్ ప్రతాప్, ఎంపీడీఓ కార్యాలయం అధికారి వశిష్ట, డాక్టర్లు రవిచంద్ర, ప్రగ్న, మౌనికా తేజ్, పున్య శాంతి, రవి చావ్లా పాల్గొన్నారు.



తూర్పుగానుగూడెంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్



నర్సాపురంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

రాష్ట్ర స్థాయి క్రీడలకు పొలమూరు విద్యార్థినుల ఎంపిక

అనపర్తి: పొలమూరులోని శ్రీసత్తి వీర్రాఘవరెడ్డి, లక్ష్మీనరసయమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ హెచ్ఎం ఆర్.విజయదుర్గ తెలిపారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.కావేరి కోనసీమ జిల్లా కొత్తపేటలో జరిగిన అండర్–17 షూటింగ్ బాల్‌లో ప్రతిభ కనబరిచి, త్వరలో అనంతరపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.హిమవర్షిణి ఆత్రేయపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్–14 నెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం తెలిపారు. వీరితో పాటు పీడీ ఎస్ఎస్ ప్రభాకరరెడ్డిని జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.రామారెడ్డి, ఉపాధ్యాయులు కె.సత్తిరెడ్డి, పి.సురేష్‌కుమార్, పి.బలరామారెడ్డి, కె.వీర్రాఘవరెడ్డి తదితరులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం విజయదుర్గ, ఉపాధ్యాయులు

ఖైదీల కేసుల దర్యాప్తుపై సమీక్ష

కంబాలచెరువు: స్థానిక జిల్లా కోర్టు ప్రధాన కార్యాలయ ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆధ్వర్యంలో బుధవారం ఎగ్జిక్యూటివ్ బాడీ, అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ సమావేశాలు నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జ్ షీట్ ఫైల్ చేసే విషయంలో పోలీసు అధికారులకు న్యాయమూర్తి సునీత పలు సూచనలు చేశారు. బెయిల్, జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సంబంధిత న్యాయస్థానాలకు సిఫారసులు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాచరణ, బాధితుల పరిహారాల కేసులపై చర్చించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఏఎస్‌పీజీ వెంకటేశ్వరరావు, సెంట్రల్ జైలు, ప్రత్యేక జైలు అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులు.. వెచ్చని నేస్తాలు

- జోరందుకున్న విక్రయాలు
- ఆకట్టుకుంటున్న రాజస్థాన్, టిబెట్ వాసుల దుకాణాలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చలి తీవ్రతను తగ్గించే ఉన్ని దుస్తులు మార్కెట్‌లోకి వచ్చేశాయి. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తుండటంతో గిరాకీ కూడా పెరిగింది. ఈ క్రమంలోనే ప్రజల అవసరాలకు అనుగుణంగా రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాల్లో ఉన్ని స్వెట్టర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. టిబెట్, నేపాల్, రాజస్థాన్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఏటా మాదిరిగానే దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే వీరితో పాటు స్థానికులు సైతం ఉన్నిదుస్తుల విక్రయాలు జరుపుతున్నారు.

జీవనోపాధి కోసం

టిబెట్ వాసులు 43 ఏళ్లుగా రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్ని దుస్తుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఏటా అక్టోబర్‌లో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో టిబెటియన్లు, రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల్లో రాజస్థాన్ వాసులు విక్రయాలు జరుపుతున్నారు. రాజమహేంద్రవరంలో ఈ సీజన్‌లో అధికంగానే దుకాణాలు వెలిశాయి. ఎంతో కాలం నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో వారికి స్థానికులు కూడా ఇళ్లను అద్దెకు ఇస్తుంటారు. వాటిలో ఉన్ని దుస్తులు నిల్వలు దాచుకుని మళ్లీ సీజన్‌లో ఇక్కడకు వచ్చి కార్యకలాపాలు కొనసాగిస్తారు. మిగిలిన ఎనిమిది నెలలు తమ స్వస్థలానికి వెళ్లిపోతారు.



కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాలు

రకరకాల దుస్తులు

చలి నుంచి కాపాడుకోవడానికి పలు రకాల స్వెట్టర్లు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. స్వెట్టర్లు, మఫ్లర్లు, బ్యాంకెట్లు, జంబుఖానాలు, రెయిన్ కోట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, జర్కిన్లు, గరం కోట్లు ఇలా చాలా రకాల ఉన్ని దుస్తులు, వస్త్రాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. యంత్రాలతో చేసిన స్వెట్టర్ల ధర కన్నా చేతితో అల్లిన స్వెట్టర్లు ఎక్కువ వెచ్చదనాన్ని ఇస్తాయి. తయారు చేసేందుకు శ్రమ కూడా ఎక్కువగా ఉండడంతో ధర కూడా కాస్త ఎక్కువే. పంజాబ్, లూథియానా, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంటారు. స్వెట్టర్లు రూ.300 నుంచి రూ.800 వరకూ, చిన్నపిల్లలవి రూ.250 నుంచి రూ.700 వరకూ పలుకుతున్నాయి. బ్లాంకెట్లు మోడళ్లను బట్టి ధర పలుకుతున్నాయి.

నాణ్యతకు ప్రాధాన్యం



మావద్ద ఉన్ని దుస్తులు నాణ్యతతో ఉంటాయి. 43 ఏళ్లుగా రాజమహేంద్రవరంలో విక్రయాలు జరుపుతున్నాం. ప్రజలు కూడా నమ్మకంతో ఆదరిస్తుండడంతో ఏటా ఇక్కడకు వస్తున్నాం. ఈ ఏడాది కూడా అందుబాటు ధరలతో పాటు నాణ్యమైన స్వెట్టర్లు అందుబాటులో ఉన్నాయి. చేతితో అల్లిన దుస్తులను సైతం విక్రయిస్తున్నాం.

– డోలామా, టిబెట్ వ్యాపారి

20 ఏళ్లుగా వస్తున్నాం



ఏటా అక్టోబర్‌లో ఇక్కడికు వచ్చి ఫిబ్రవరి చివరి వరకూ వ్యాపారాలు కొనసాగిస్తాం. మా వద్ద నాణ్యమైన ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు లభిస్తుండడంతో అమ్మకాలు బాగా ఉంటాయి. 20 ఏళ్లుగా ప్రజలు మాపై నమ్మకంతో దుస్తుల్ని కొనుగోలు చేస్తున్నారు.

– బినోద్ కౌశల్, టిబెట్ వ్యాపారి

అమరజీవి త్యాగం మరువలేనిది



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి



పందలపాకలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసాద్



రాజానగరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్యులు

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి, త్యాగం మరువలేనివని ఎంపీడీఓ వీవీ సాయిబాబా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సాయిబాబా పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర సాధన కోసం 1952 అక్టోబర్ 19న దీక్ష చేపట్టిన పొట్టి శ్రీరాములుకు మద్దతుగా ప్రజలు సమ్మెలు, ప్రదర్శనలు చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆశయ సాధనలో ప్రాణాలర్పించి పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారని కొనియాడారు. ఆయన త్యాగం ఫలితంగా ఆంధ్రులకు ప్రాంత, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతులయ్యారని నివాళులర్పించారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కాంచన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చలమయ్య, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు

బిక్కవోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి ప్రతి రూపమని, రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవడం శుభపరిణామమని పందలపాక పంచాయతీ కార్యదర్శి ఎంవీవీఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం సచివాలయం–1 వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. రాష్ట్రం ఉన్నంత వరకూ ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో తొస్సిపూడి పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్, ఏఎన్ఎంలు కె.అనంతలక్ష్మి, ఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం

రాజానగరం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజానగరంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గ్రంధి నానబ్బులు, మండల అధ్యక్షుడు మండవల్లి వెంకన్నబాబు, కోశాధికారి దవులూరి శ్రీను, గిరిబాబు, కంకటాల రాజు పాల్గొన్నారు.

గోకవరం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ, ముమ్మిడివరపు చినబాబు, కాజా రామ్‌కుమార్, మరిడిరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.